సాక్షి చిత్తూరు

సోమవారం । 9 । జూన్ । 2025



కాణిపాకం కిటకిట

కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పోటెత్తారు. - 8లో



బతుకు బండి బస్టాండు

రేషన్ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఎండీయూ ఆపరేటర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. - 8లో



విత్తన నాణ్యతతో దిగుబడులు

సాగులో నాణ్యమైన విత్తనాలు వినియోగించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కనున్న రిజర్వు (ఏఆర్)కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చనన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో హుండీ లెక్కింపు

తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 9 గంటలకు హుండీ లెక్కిస్తామని ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి హనుమంతురావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కిస్తామని వివరించారు.

గురుకులాల్లో ఎంపిక ప్రక్రియ

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు తమ సీటు ఖరారు చేసుకోవాలని డీసీఓ గీత తెలిపారు. ఇటీవల నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు జరిగిన పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందిన వారికి ఎంపిక ప్రక్రియ జరుగుతోందన్నారు. ఎంపికైన విద్యార్థుల మొబైల్‌కు మెసేజ్ వచ్చిన వెంటనే ఆయా పాఠశాలలు, కళాశాలకు వెళ్లి తమ సీటును ఖరారు చేసుకోవాలని డీసీఓ కోరారు. మొదటి జాబితాలో అర్హత పొందినవారు వెంటనే ప్రవేశం పొందాలని, లేనిపక్షంలో వారికి ప్రవేశం ఉండదన్నారు. ఈ నేపథ్యంలో రెండో జాబితాను వెంటనే విడుదల చేస్తామన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానం వద్దు




మాట్లాడుతున్న చైతన్య

చిత్తూరు కార్పొరేషన్ : అధికారంలో లేనప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై కూటమి నేతలు గగ్గోలు పెట్టిన కూటమి నేడు స్మార్టు మీటర్ల బిగింపు వేగవంతం చేయాలని అనడం విడ్డూరంగా ఉందని విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్మార్టు మీటర్ల విధానం లోపభూయిష్టంగా ఉందని, దీనిని రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు. ఆదానీ సంస్థకు కోట్లు విలువ చేసే ఈ ప్రాజెక్టును కేంద్రం ఇచ్చిందన్నారు. వారికి ఎదురు చెప్పలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. వాణిజ్య, పరిశ్రమల బిగింపు అయ్యాక నివాసాలకు మీటర్లను బిగించనున్నారని, వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సాకత్, భాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీసెట్–2025 పరీక్ష ఉమ్మడి జిల్లాలోని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం జరగనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు సెషన్లలో జరగనున్న ఈ పరీక్షకు తొలి రోజు 366 మంది హాజరవుతారని చెప్పారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి కంటే అర్ధగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పీజీ సెట్ పరీక్షలు ఈనెల 12వ తేదీ వరకు జరగనున్నట్టు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 88,257 మంది స్వామివారిని దర్శించుకోగా 45,068 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

యువతకు వెన్నుపోటు

కూటమి టీడీపీ ఎన్నికల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించింది. ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రగల్భాలు పలికింది. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఆర్భాటం చేసింది. తీరా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగాల ఊసే మరిచిపోయింది..భృతి కలగా మారిపోయింది. ఇక జాబ్ క్యాలెండర్‌పై చేతులెత్తేసింది. ఇలా యువతను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా నిలువునా ముంచేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 4.56 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి ఉపాధి అవకాశాలు కల్పించింది. కానీ నేడు కూటమి ప్రభుత్వం యువతకు వెన్నుపోటు పొడిచింది.



జాబ్ క్యాలెండర్ ..నాటకం

ప్రస్తుత మంత్రి నారా లోకేష్ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామంటూ గతంలో పదే పదే ఉదరగొట్టారు. యువతతో ఎక్కడ సమావేశాలు నిర్వహించినా జాబ్ క్యాలెండర్ మాటే ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ సర్కార్ పై లేనిపోని అవాస్తవాలను ప్రచారం చేసి యువతను ఏమార్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ లేకుండా చేతులెత్తేశారు. దీనికి తోడు తమకు నష్టం కలిగించే నిర్ణయాలనే అమలు చేస్తున్నారంటూ జిల్లాలోని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- బాబూ జాబు ఎక్కడ అంటున్న నిరుద్యోగులు
- 20 లక్షల ఉద్యోగాలిస్తామంటూ ఊరించిన కూటమి
- ఏడాదవుతున్నా ఒక్క ఉద్యోగమూ ఇవ్వని ప్రభుత్వం
- ఊసేలేని జాబ్ క్యాలెండర్ ప్రకటన
- అడ్డగోలుగా వేల మంది ఉద్యోగాలతొలగింపు
- జిల్లాలో ఏటా 32 వేల ఇంజినీరింగ్ పట్టభద్రులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 116 డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు 14, ఐటీఐ, నర్సింగ్, పాలిటెక్నిక్, మెడకల్, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు 53 ఉన్నాయి. ఈ కళాశాలల్లో 64,789 మంది విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికే డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసి డీఎస్సీ, గ్రూపు పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర కొలువుల కోసం ప్రయత్నాలు చేస్తున్న వారు 32 వేలకు పైగా ఉన్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం అయినకాడికి అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులు ఎందరో.. ఉన్నత చదువులు చదివి కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అరకొర జీతంపై స్థానికంగా, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి వ్యాపార, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. వీరిలో ఎంతో మంది తమ చదువుకు తగ్గ ఉద్యోగం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

ఇంటికొక ఉద్యోగమని నమ్మించి మోసం

కూటమి ప్రభుత్వం యువశక్తికి వెన్నుపోటు పొడిచింది. దేశాభ్యున్నతికి అండగా నిలిచే యువతను నిర్వీర్యం చేస్తోంది. అధికారంలోకి రాగానే ఇంటికొక ఉద్యోగం ఇస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ తమ హామీల అమలును గాలికొదిలేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం...20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం...ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తాం అంటూ ఎన్నికల ప్రచారం చేసిన నేతలు ఇప్పుడు ఏ మాత్రం నోరు మెదపడం లేదు. ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలనను చేరువ చేసేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థను రద్దు చేశారు. రాజకీయ కక్షతో డ్వామా, డీఆర్‌డీఏ, విద్యాశాఖ, జిల్లా పరిషత్ పలు శాఖల్లో పనిచేస్తున్న చిరుద్యోగులను వేల మందిని జిల్లాలో తొలగించారు.

పట్టాలు చేతబట్టుకొని..

జిల్లా వ్యాప్తంగా ఏటా ఇంజినీరింగ్ చదువులు పూర్తి చేసి 32 వేల మంది వరకు యువత పట్టాలతో బయటకు వస్తున్నారు. డిగ్రీ, పీజీలు చేసిన మరో 35 వేల మంది వరకు చదువులు పూర్తి చేసుకుని పట్టాలు చేతబట్టి ఉపాధి కోసం వెతుకుతున్నారు.

నాలుగు లక్షల మంది యువతకు మొండిచేయి

జిల్లాలోని యువత చంద్రబాబు అండ్ కో చేతిలో మరోసారి మోసపోయారు. ఏడాదికి నాలుగు లక్షలు కాదు కదా కొత్తగా నాలుగు పదుల సంఖ్యలోనైనా ఉద్యోగాల భర్తీని కూటమి ప్రభుత్వం చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలను సైతం ఊడగొడుతున్నారు. సచివాలయ ఉద్యోగులను అనిశ్చితి పరిస్థితుల్లోకి నెట్టేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు బాట పట్టిస్తున్నారు. రూ.5 వేలు కాదు కదా రూ.10 వేలు ఇస్తామని వలంటీర్లలో ఆశలు కల్పించి తీరా అధికారంలోకి వచ్చాక వారి ఉద్యోగాలు తొలగించి కడుపులు కొట్టారు. ఇక నిరుద్యోగ భృతి హామీ టీడీపీ 2014–19 పాలనలో మాదిరిగానే ప్రస్తుతం ఎగనామం పెట్టేశారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 4 లక్షల మంది నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపించారు.

భృతి.. బూటకం

టీడీపీ నేతలు ఎన్నికల సమయంలో ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతిని ఇస్తామని ఆర్భాటంగా ప్రచారం చేశారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని విస్తృతంగా ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి మాటే జిల్లాలో వినిపించడం లేదు. చిత్తూరు జిల్లాలో లక్షల మంది నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నమ్మి కూటమి నేతలకు ఓట్లు వేసి గెలిపించామని, ఇప్పుడు భృతి ఊసే ఎత్తకపోవడం దుర్మార్గం.

వీరుకాకుండా చదువులు మధ్యలో ఆపేసిన మరో 15 వేల మంది తమ అర్హతలను బట్టి ఉద్యోగాల కోసం రోడ్లపై తిరుగుతున్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ, బీఈడీ, డీఈడీ వంటి ఇతర కోర్సులను పూర్తి చేసిన యువత తమ అర్హత పత్రాలతో ఉద్యోగాల వేటలో ఉన్నారు.

ప్రైవేట్ ఉద్యోగాల పరిస్థితి అంతంతే..

కూటమి అధికారంలోకి వచ్చాక వ్యాపారాలు దిగజారాయి. ఏ నెలకానెల జీఎస్టీ ఆదాయం దిగజారుతుండటం వ్యాపారాల దుస్థితికి అద్దం పడుతోంది. అటు ఉద్యోగాలు లేక, పరిశ్రమల స్థాపనకు అవకాశం లేక, అల్లాడుతున్న యువత ఏదైనా ప్రైవేట్ సంస్థలో జాబ్ చేసుకుని కుటుంబానికి అండగా ఉందామని భావిస్తే దానికి సైతం ఈ ప్రభుత్వ విధానాలు గండికొడుతున్నాయి. చిత్తూరు జిల్లాలో గత ఏడాది 32 శాతానికి పైగా వ్యాపారాలు పడిపోయాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కనీసం 35 శాతం పెరుగుదల ఉండే రంగాల్లోనూ అంతమేర తగ్గుదల ఉండటంతో యువతకు ఎటువంటి అవకాశాలు లేకుండా పోతున్నాయి.

గత ఐదేళ్లల్లో ఉద్యోగాల జాతర

వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభించాయి. గడిచిన ప్రభుత్వం దాదాపుగా 4.56 లక్షల ఉద్యోగాలు జిల్లాలో భర్తీ చేసింది. అందులో 2 లక్షల ఉద్యోగాలు శాశ్వత ఉద్యోగాలు కావడం గమనార్హం. ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం భద్రత కల్పించింది. యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా లక్ష వరకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు.

జాబ్ క్యాలెండర్ ఆర్భాటమేనా..



జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో ఆర్భాటంగా ప్రకటించారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి మరిచిపోయారు. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఎంఎస్సీ వరకు చదువుకున్నాను. ఉద్యోగం రాకపోవడంతో సొంత గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నా. నిరుద్యోగులు కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మరోసారి మోసపోయారు.

– రమేష్, వి.కోట మండలం, చిత్తూరు జిల్లా

మోసపూరిత వాగ్దానాలు



చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగ భృతి అంటూ మోసం చేశారు. మళ్లీ మొన్న ఎన్నికల్లోనూ ఈ హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. ఇలా మోసపూరిత వాగ్దానాలతో యువతను మోసం చేయడం సమంజసం కాదు.

– సద్దాం, విద్యార్థి సంఘ నాయకుడు,చిత్తూరు నగరం

జిల్లాలోని కళాశాలల సమాచారం	
డిగ్రీ కళాశాలలు	116
ఇంజినీరింగ్ కళాశాలలు	14
ఐటీఐ కళాశాలలు	18
నర్సింగ్ కళాశాలలు	07
పాలిటెక్నిక్ కళాశాలలు	08
మెడికల్	02
బీఈడీ కళాశాలలు	07
ఎంబీఏ, ఎంసీఏ	11
మొత్తం కళాశాలలు	183

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం

జిల్లా వ్యాప్తంగా ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు పది నెలలుగా ఎదురుచూపులే మిగిలాయి. విద్యాదీవెన, వసతి దీవెన నిధుల కోసం విద్యార్థులు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమో తదితర కోర్సులకు సంబంధించి ఏడాది ఫీజును రీయింబర్స్‌మెంట్‌లో నాలుగు విడతలుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని కూటమి హామీ ఇచ్చింది. అయితే 2024–25 విద్యాసంవత్సరం పూర్తయినా...ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చిల్లిగవ్వ చేతికందలేదు. దీంతో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కూటమి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలు ఫీజులు చెల్లించాలని ఒత్తిళ్లు చేస్తుండటంతో తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

నోటిఫికేషన్లు లేవు.. భృతి లేదు..



ఎంఎస్ఎంఈ పరిశ్రమలు స్థాపించి 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకొస్తామన్నారు. ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తామన్నారు. ఇప్పుడేమో సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలవుతోంది ఏ వర్గానికి ఎలాంటి మేలు చేయలేదు. బీఎస్సీ కంప్యూటర్స్ చదువుకున్నాను. ఎలాంటి నోటిఫికేషన్లు లేకపోగా, నిరుద్యోగ భృతి ఇవ్వలేదు.

– కిషోర్, నిరుద్యోగి, నగరి మండలం

కుటుంబంపై మరింత భారం



ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో తల్లిదండ్రులపై మరింత భారం పడుతోంది. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో వచ్చేది. గత ఐదేళ్లు ఎలాంటి సమస్యలు లేవు. ప్రస్తుతం ఫీజు మొత్తం ఒక్కసారి కట్టలేక విద్యార్థులంతా ఆందోళనకు లోనవుతున్నారు. ఫీజుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం.

– ముస్తా, విద్యార్థి, కార్వేటినగరం

నేడు బోయకొండలో యోగాంధ్ర

- ఉదయం 7గంటలకే ప్రారంభం
- ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాక
- ఏర్పాట్ల నిర్వహణపై కలెక్టర్ ఆరా



సుమిత్‌కుమార్, కలెక్టర్

చౌడేపల్లె : మండలంలోని బోయకొండ వద్ద సోమవారం ఉదయం 7 గంటలకే యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. యోగా డే కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్నిశాఖల సమన్వయంతో నిర్ణీత సమయానికి బోయకొండ గోశాల వద్దకు చేరుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాసనాలు నిర్వహిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో సుమారు 2 వేల మందితో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు రవాణా, మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. తొలుత స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆస్థాన మండపంలో శ్రీసరస్వతిదేవిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం చిన్నపిల్లల చేత ఈవో పెంచల కిషోర్ అక్షరాలు దిద్దించారు. అక్షరాభ్యాసం శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమానికి 200 మంది పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు,సిబ్బంది కోదండపాణి, హరి, మాధవరెడ్డి, వాసు పాల్గొన్నారు.



అలంకరణలో సరస్వతి దేవీ



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఈఓ పెంచల కిషోర్

అయ్యోర్ల ఆగ్రహం

- ఉద్యమించిన ఉపాధ్యాయులు
- వెబ్ ఆప్షన్ విధానం రద్దు చేయాలంటూ ధర్నా
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- మోకాళ్ల పై కూర్చొని నినాదాలు
- బారికేడ్లు పెట్టి మోహరించిన పోలీసులు



దీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘాల నాయకుల నిరసన

చిత్తూరు కార్పొరేషన్ : తమ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఉద్యమించారు. బదిలీ కౌన్సెలింగ్ జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు. డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఆదివారం ఉదయం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. వారిని నిలువరించేందుకు పోలీసులు భారీగా మోహరించారు. వారిని కార్యాలయంలోకి పంపకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో అయ్యోర్లు రోడ్డు పై బైఠాయించారు. మండు టెండలో మోకాళ్ల పై నిల్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఓ ఉపాధ్యాయుడు తల కిందులుగా నిరసన తెలిపాడు. వెబ్ కౌన్సెలింగ్ విధానం రద్దు చేయాలని నినదించారు. కాని పక్షంలో సోమవారం నుంచి నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

రీ కౌన్సెలింగ్ జరిపి న్యాయం చేయాలి

ఉపాధ్యాయుల బదిలీకి సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ వద్దని మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వెబ్ ఆప్షన్‌లో వచ్చిన లోపాలను సవరించాలని నినాదాలు చేశారు. నష్టపోయిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రీ కౌన్సెలింగ్ జరిపి న్యాయం చేయాలని కోరారు. 20 రోజుల ముందు జరిగిన చర్చల్లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు విద్యాశాఖ అంగీకరం తెలిపిందన్నారు. కానీ మళ్లీ వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని కోరడం ఏమిటన్నారు. దీంతో ఎస్జీటీలు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ప్రధానంగా సీనియర్లకు అన్యాయం జరుగుతోందని అంతా గందరగోళంగా మారిందన్నారు. ఈ విధానం వల ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు.

టీచర్ల డిమాండ్లు ఇవీ..

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలి. రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వెబ్ సైట్‌లో తప్పనిసరిగా బదిలీగా చూపడం సరికాదు. ఫైనల్ సీనియర్ జాబితా విడుదల చేయకుండా ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం అన్యాయం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకపోవడంతో తర్వాత సదరు ఖాళీలను పదోన్నతుల్లో చూపడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు ఇస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకే పోస్టును ఇద్దరికి కేటాయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, మణికంఠన్, చెంగ్రాయమందడి, మోహన్, ముత్యాలరెడ్డి, శేఖర్, సోమశేఖర్‌నాయుడు, భాస్కర్ పాల్గొన్నారు.



తలకిందులుగా టీచర్ నిరసన

విద్యాశాఖ మంత్రి స్పందించాలి



విద్యాశాఖమంత్రి నారా లోకేష్ మా సమస్యల పై స్పందించాలి. ఉమ్మడి జిల్లాలో 3,253 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం అయ్యోర్లు రోడ్డు ఎక్కారు. అయిన ఇంత వరకు ఒక ప్రకటన లేదు. జిల్లావాసి చంద్రబాబుకు మా సమస్యలు పట్టడం లేదు.
– మదన్ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్టీయూ

సీనియర్లు నష్టపోతున్నారు



సీనియర్లు జూనియర్లుగా, జూనియర్లు సీనియర్లుగా బదిలీ ప్రక్రియ విధానం జరుగుతోంది. సీనియార్టీకి విలువ లేకుండా పోతోంది. గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఉపాధ్యాయులు అయోమయంగా ఉన్నారు. డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.
– దీనవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, యూటీఎఫ్

మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలి



గతంలో జరిగిన చర్చల్లో ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు. ఇప్పుడు అలా జరగడం లేదు . ఇచ్చిన మాటను తప్పారు. మ్యానువల్ కౌన్సెలింగ్‌ను తుంగలో తొక్కి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపడుతున్నారు. ఇదిసరైన పద్ధతి కాదు.
– రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

దౌర్జన్యంగా బదిలీలు



అసంబద్ధంగా జరుగుతున్న బదిలీల ప్రక్రియ పై భవిష్యత్తు ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం. వీటిపై ఫిర్యాదు చేయడానికి గ్రీవెన్స్ ఏర్పాటు చేయలేదు. సీనియార్టీ ప్రకారం వివరాలు అందుబాటులో లేవు. దౌర్జన్యంగా బదిలీల ప్రక్రియ చేస్తున్నారు.
– కన్నన్,జిల్లా అధ్యక్షుడు పీఆర్టీయూ

పరిష్కార మార్గం చూపాలి



గతంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ సజావుగా సాగింది. అప్పుడు మా సమస్యలను విని వాటిని పరిష్కరించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. అంతా అసంపూర్తిగా ఉంది. ఉపాధ్యాయులు అయోమయంలో ఉన్నారు. ఇకనైన వీటికి పరిష్కార మార్గం చూపాల్సి ఉంది. లేకపోతే భవిష్యత్తులో నష్టం తప్పదు.
– బాలాజీ, రాష్ట్ర అధ్యక్షుడు, ఆపస్

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం



విశ్వతేజ (ఫైల్)

చౌడేపల్లె : తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన యువకుడు విశ్వతేజ(17) ఆచూకీ తెలియజేయాలని తల్లిదండ్రులు అమరావతి, అమర్నాద్ ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. చౌడేపల్లె బజారు వీధిలో నివాసం ఉంటున్న వీరు తమ కుమారుడు విశ్వతేజను శనివారం మధ్యాహ్నం మందలించారు. అప్పటి నుంచి కనపడకపోవడంతో వెతికినా ఫలితం లేకపోయిందని, ఆచూకీ తెలిసినవారు చౌడేపల్లె పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



బావిలో మునిగి మృతి చెందిన మురళి

బంగారుపాళెం : మండలంలోని తగ్గువారిపల్లెలో ఆదివారం బావిలో మునిగి కర్ణాటకకు చెందిన యువకుడు మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోలారు జిల్లా ముళబాగిల్ తాలూకా చాపరహళ్లికి చెందిన వెంకటరమణ కుమారుడు మురళి(23) బంగారుపాళెం మామిడి మార్కెట్‌లో ఓ మండిలో పనులు చేసేందుకు వచ్చాడు. ఆదివారం పనులు లేక పోవడంతో తగ్గువారిపల్లె సమీపంలో ఓ వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు స్నేహితులు అమర్, అజయ్, విశ్వనాథ్, విజయ్, రాజశేఖర్, గణేష్, తేజతో కలసివెళ్లాడు. ఈత కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు మురళి నీటిలోపలికి వెళ్లడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. స్నేహితులు మురళిని బయటకు తీసే సరికి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారు పాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



వాహనం నుంచి వేరై పక్కకు పడిపోయిన క్యాబిన్



డ్రైవర్ లోకేష్ మృతదేహం

పలమనేరు : మండలంలోని జగమర్ల క్రాస్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం ముందు వెళుతున్న వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఐచర్ వాహనం ఢీకొంది. ఐచర్ క్యాబిన్ ధ్వంసమై తీవ్ర గాయాలతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నుంచి క్యాబిన్ వేరై రోడ్డు పక్కనున్న పల్లంలోకి పడిపోయింది. మృతి చెందిన డ్రైవర్ బైరెడ్డిపల్లి మండలం కోట్రేపల్లికి చెందిన లోకేష్ (30)గా గుర్తించారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీ ఐచర్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. చెన్నైలో సరుకు అన్‌లోడ్ చేసి బెంగళూరుకు వస్తుండగా మొగిలి ఘాట్‌లో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసును విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాణిపాకం కిటకిట

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి దాకా భక్తులు బారులు తీరారు. భక్తులతో ఆలయం రద్దీగా కనిపించింది. భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



కుప్పం : కుప్పం రైల్వేస్టేషన్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం దిబ్రూనగర్ నుంచి బెంగళూరు వెళ్తున్న రైల్లో ప్రయాణిస్తుండగా కుప్పం రైల్వేస్టేషన్ రాగానే ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. రైల్వే పోలీసులు గాయపడిన వ్యక్తిని కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. బ్లూకలర్ టీ షర్ట్ దరించి ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కర్ణాటకలో కుప్పం మహిళా దొంగల అరెస్టు

రూ.6 లక్షల నగలు స్వాధీనం



పట్టుబడిన నిందితులు

దొడ్డబళ్లాపురం : రద్దీగా ఉన్న బస్సులు, బస్టాండ్లలో చోరీలకు పాల్పడుతున్న చిత్తూరుకు చెందిన నలుగురు మహిళా దొంగలు పట్టుబడ్డారు. చిత్తూరు జిల్లా కుప్పం నివాసులైన శశి (35), మాధవి (40), అఖిల (30), విద్య (29) అనేవారిని కర్ణాటకలోని హాసన్ జిల్లా హొళెనరసీపుర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.6.38 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. హొళెనరసీపుర బస్టాండులో ఒక మహిళ బంగారు గొలుసు చోరీకి గురైంది. పోలీసులు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో నలుగురు మహిళలు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో దొంగలని తేలడంతో అరెస్ట్ చేశారు. వీరి మీద బెంగళూరులోని పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు నమోదై ఉన్నాయి. నలుగురూ ముఠాగా ఏర్పడి ఊరూరా తిరుగుతూ చోరీలు చేసి మళ్లీ కుప్పంకు వెళ్లిపోయేవారని పోలీసులు తెలిపారు.

విత్తన నాణ్యతతో దిగుబడులు



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన పూల సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేతలు

పెనుమూరు(కార్వేటినగరం) : సాగులో నాణ్యమైన విత్తనం వినియోగించడం ద్వారా మంచి దిగుబడిని సాధించవచ్చని రాస్ కృషి వి/్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రాస్ కృషి వి/్ఞాన కేంద్రం తిరుపతి, వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఆదివారం పెనుమూరు మండలంలోని గొబ్బిళ్లమిట్ట, వడ్లవాని మిట్ట, గాంధీపురం గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేతలు , వ్యవసాయశాఖ అధికారులు రైతులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు నూతన రకాలు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మొదలైన వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా పాడిపశువుల పోషణ, సమగ్ర వ్యవసాయ విధానం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ నుంచి అందిస్తున్న వివిధ సేవలు, మొబైల్ యాప్‌ల ప్రాముఖ్యం, వినియోగం మొదలైన అంశాలను వివరించారు. అనంతరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పూల మొక్కల నర్సరీలో కృత్రిమ లైటింగ్, ప్లాస్టిక్ మల్చింగ్ వంటి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత డాక్టర్ ఎం.మంజునాథ్, పెనుమూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, కేవీకే విస్తరణ శాస్త్రవేత శ్రీరామ్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది , అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ జాప్యంపై దాడి

చిత్తూరు రూరల్(కాణిపాకం) : ఉద్యోగ రాజీనామా అనంతరం మంజూరు చేయాల్సిన క్లియరెన్స్ సర్టిఫికెట్ (తొలగింపు పత్రం) జాప్యంపై సంజయ్ అనే యువకుడు రామాంజనేయులు (39)పై దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు బీఎస్ఆర్ పేట ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. చిత్తూరు నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రామాంజనేయులు ఏరియా మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. చిత్తూరు మండలం ముత్తుకూరుకు చెందిన సంజయ్ రామాంజనేయుల వద్ద అసిస్టెంటుగా పని చేస్తున్నారు. ఆరు నెలల కిందట సంజయ్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇటీవల తమకు అందాల్సిన క్లియరెన్స్ సర్టిఫికెట్ (తొలగింపు పత్రం) మంజూరులో జాప్యంపై సంజయ్ మేనేజరు రామాంజనేయులతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేదు. ఆగ్రహించిన సంజయ్, తన స్నేహితులు ఐదు మందితో కలసి శనివారం తాళంబేడుకు కంతులు వసూలు చేయడానికి వచ్చిన రామాంజనేయులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు చెప్పారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ కేసులో బీఎస్ ఆర్ పేటకు చెందిన ఓ వ్యక్తి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. అతనిపై కూడా కేసు నమోదు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

బతుకు‘బండి’ బస్టాండు



రేషన్ వాహనాలను తీసేయడంతో ఎండీయూ ఆపరేటర్లు రోడ్డున పడ్డారు. వాహనం కోసం తీసుకున్న అప్పు ఇక ఎలా చెల్లించాలని ఆపరేటర్లు నెత్తినోరు బాదుకుంటున్నారు. గత ప్రభుత్వం మీద కక్షతో పేదల కడుపుకొట్టడంతో వారి బతుకు వీధిన పడింది. ఇక ఆ కుటుంబాలు పడుతున్న బాధలు అన్నీఇన్ని కావు. ఒక వైపు కంతులు చెల్లించకపోతే వాహనాలను తీసుకెళ్తారు.. మరోవైపు కుటుంబాన్ని పోషించాలంటే మరోదారి కనిపించడంలేదు. ఏం చేయాలో దిక్కుతోచక ఆత్మహత్యలే శరణ్యమని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- రోడ్డున పడ్డ ఆపరేటర్లు
- రేషన్ షాపుల్లోనే రేషన్ పంపిణీ మొదలు
- ఇకపై వాహనాలకు డ్యూలు చెల్లించని ప్రభుత్వం
- ఆపరేటర్లే మిగిలిన అప్పును చెల్లించాలి
- మూడు డ్యూలు చెల్లించకుంటే వాహనం సీజ్ తప్పదు
- ఉపాధి కోల్పోయిన వాహన నిర్వాహకులు

పలమనేరు : నిన్న మొన్నటి దాకా సంచార వాహనంలోనే రేషన్ సరుకులను పంపిణీ చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఇకపై వాహనాలు వద్దని ఆయా డీలర్ల వద్దే సరుకులు పంపిణీ చేపడుతోంది. దీంతో ఇన్నాళ్లు దీన్నే నమ్ముకున్న ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో పాటు వారు బ్యాంకు రుణం ద్వారా వాహనం కోసం తీసుకున్న అప్పులో భాగంగా మిగిలిన కంతులు ఆపరేటర్లు చెల్లించాలి. మూడు నెలలు ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించకుంటే బ్యాంకర్లు ఆ వాహనాలను స్వాధీనం చేసుకోవడం ఖాయం. దీంతో ఎండీయూ (మొబైల్ డిస్‌పాచింగ్ యూనిట్స్) ఆపరేటర్లకు కష్టాలు తప్పేలా లేవు.

వాహనాల నుంచే ఇప్పటి దాకా సరఫరా

రేషన్ దుకాణ పరిధిలోని కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసేవారు. పీడీఎస్ రైస్‌కు సంబంధించి ఐసీడీఎస్(అంగన్‌వాడీలు) స్కూళ్లు, హాస్టళ్లకు ఈ వాహనాల్లోనే సరఫరా చేసేవాళ్లు. రేషన్ దుకాణం ఉన్న గ్రామానికి ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండే ఆవాస గ్రామాల్లోని కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ వాహనాల ద్వారా సరుకులు ప్రతినెలా అందేవి. దీంతో అటవీ సమీప గ్రామాలు, వ్యవసాయ పొలాల వద్ద నివసాలుండే వారికి ఎంతో సౌకర్యంగా ఉండేది.

ఆపరేటర్ల పరిస్థితి ఏంటంటే..

రేషన్ షాపుల పరిధిలో ఆపరేటర్లను ఎంపిక చేశారు. యూనిట్ కాస్ట్ రూ.5,81,190 కాగా ఇందులో వేయింగ్ సామగ్రి కోసం రూ.9,260గా నిర్ణయించారు. వీరికి వాహనాలను బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రుణాలను అందించారు. ఈ వ్యవహారాలను ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎస్‌సీఎల్) చేపట్టింది. ఈ సందర్భంగా ఆపరేటర్లు 10శాతం కాంట్రిబ్యూషన్,90శాతం లోనుగా ఈ ప్రాజెక్టు ఫిబ్రవరి 2021 నుంచి జనవరి 2027 దాకా జరిగేలా అగ్రిమెంట్ ఉంది. ఇందులో ఆపరేటర్‌కు నెల జీతం రూ.21 వేలుగా నిర్ణయించారు. ఇందులో బ్యాంకుకు ప్రభుత్వం ద్వారా కంతుకు రూ.5879, ఆపరేటర్ రూ.3 వేలు చెల్లించాలి. రూ.21 వేలలో కంతు కోసం రూ.3 వేలు, ఇంధనానికి రూ.3 వేలు, అసిస్టెంట్‌కు రూ.5 వేలు పోగా నెలకు ఆపరేటర్‌కు రూ.10 వేలు మిగిలేది.

రేషన్ డీలర్లకు మేలు చేసేందుకే...

ఎండీయూల ద్వారా రేషన్ పంపిణీ డిజిటల్ తూకాల ద్వారా పక్కాగా ఇన్నాళ్లు సాగేది. ఇప్పుడు పంపిణీ ఆయా డీలర్లకు ఇవ్వడంతో చాలా చోట్ల త్రాసులు వాడి సరుకుల పంపిణీ సాగుతోంది. దీంతో అక్రమాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువ. కొందరు డీలర్లు అందుబాటులో ఉండక ప్రజలకు కష్టాలు తప్పవు. దీంతో పాటు రేషన్ సరుకుల్లో అక్రమాలు అప్పుడే మొదలైనట్లు ఇటీవల జరుగుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం.

మిగిలిన డ్యూలు కట్టుకోవాలి..

ఇప్పటి దాకా 72 నెలల్లో 53 నెలలు ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకు అప్పుగా రూ.5879 చెల్లించింది. ఇప్పుడు ఈ వ్యవస్థను రద్దు చేయడంతో ఆపరేటర్లు నెలకు డ్యూ రూ.3 వేలు చొప్పున మిగిలిన 20 నెలలు కట్టాల్సిందే. మూడు నెలలు డ్యూ కట్టకుంటే వాహనాన్ని ఫైనాన్స్ ఇచ్చిన బ్యాంకు జప్తు చేస్తుంది. దీంతో ఆపరేటర్లు తమ వాహనాలను పాల ట్యాంకర్లు తోలేందుకు, ఇతర అద్దెలకు తిప్పాల్సి వస్తోంది. అద్దెలు లేకుంటే కంతు కట్టలేక వాహనాన్ని వదుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



రేషన్ వాహనాన్ని పాల క్యాన్ల కోసం పెట్టిన ఆపరేటర్

జిల్లా సమాచారం ఇలా..	
జిల్లాలోని మండలాలు	32
మొత్తం రేషన్ సరఫరా సంచార వాహనాలు	326
రేషన్ దుకాణాలు	1346
రేషన్‌కార్డు దారులు	5.36 లక్షలు
వాహనాల్లో పనిచేసే ఆపరేటర్లు	326
వాహన హెల్పర్లు	326

ప్రభుత్వం మోసం చేస్తుందని అనుకోలేదు..



ఇటీవల సంబంధిత మంత్రిని కలిసి మాట్లాడినా మీకెలాంటి ఇబ్బందులు ఉండవని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఇకపై డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ అని ఉత్తర్వులను జారీ చేసింది. ఇకపై వాహనాలకు కంతులు ఎలా కట్టుకోవాలి. మా కుటుంబాలను ఎలా పోషించాలో అర్థం కావడంలేదు.
– వేణు, ఎండీయూ వాహనాల ఆపరేటర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు

వాహనాన్నే నమ్ముకొని ఉన్నాం



గత ప్రభుత్వంలో నుంచి ఆపరేటర్‌గా నిత్యావసరాలను అందిస్తూ ప్రభుత్వం అందించే వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇకపై రేషన్ పంపిణీకి వాహనాలు లేవని ఆదేశాలందాయి. ఆ ఉన్న పనిపోయింది. మళ్లీ ఇప్పుడు పని కోసం వెతుక్కోవాలి. బండికి డ్యూలు కట్టాలంటే అద్దెలు దొరికితేనే కదా. దీన్నే నమ్ముకుని ఉన్న మాలాంటి వాళ్ల బాధలు ఈ ప్రభుత్వానికి అర్థం కాలేదు.
– బాబు, ఎండీయూ ఆపరేటర్, నక్కపల్లి

ఉపాధి లేకుండా చేశారు



ఏదో పని ఉందని దాన్ని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాళ్లం. ఉన్నట్టుండి మమ్మల్ని తీసేశారు. వాహనాలకు ఇంకా బ్యాంకు అప్పు పెండింగ్‌లో ఉంది. దాన్ని మేమే కట్టుకోవాలంట. ఏమి చేసేదో అర్థం కాలేదు. ఉన్న వాహనాన్ని బాడుగకు తిప్పుదామన్నా బాడుగలు దొరకడంలేదు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.
– ప్రసాద్‌రెడ్డి, ఆపరేటర్, గంటావూరు